ప్రజాశక్తి
శనివారం 27 మే 2023
5
శ్రీ సత్యసాయి

జగనన్న హౌసింగ్ లేఅవుట్ నిర్మాణ పనులపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

జూన్ నెలాఖరులోపు లక్ష్యాన్ని చేరుకోవాలి

కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-కదిరి టౌన్

జగనన్న హౌసింగ్ లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి పురోగతిని మరింత పెంచి జూన్ నెలాఖరులోపు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం నాడు కదిరి ఆర్డీవో కార్యాలయం ఎదురుగా ఉన్న జగనన్న హౌసింగ్ లేఔట్‌ను పరిశీలించారు. అక్కడి ఇళ్ల నిర్మాణాలపై అధికారులతో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్లు పథకం కింద జగనన్న హౌసింగ్ లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణంపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించి వేగవంతం చేయాలన్నారు. బిలో బేస్మెంట్ స్థాయి నుంచి బేస్మెంట్ స్థాయికి, బేస్మెంట్ స్థాయి నుంచి మరింత పురోగతిలోకి ఇళ్ల నిర్మాణాలను తీసుకెళ్లాలని సూచించారు. ఆర్‌ఎల్, ఆర్సీ స్థాయిలోని ఇళ్ల నిర్మాణాలు ఖచ్చితంగా లక్ష్యం మేరకు పూర్తి చేయాలని, జూన్ నెలాఖరులోపు నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. కదిరి ఆర్డీవో కార్యాలయం ఎదురుగా ఉన్న జగనన్న హౌసింగ్ లేఅవుట్‌లో 977 ఇళ్లు మంజూరు కాగా, మొత్తం ఇళ్లకు మ్యాపింగ్ పూర్తి అయ్యిందన్నారు. 961 ఇళ్లకు జియో ట్యాగింగ్ పూర్తయిందని, మిగిలిన ఇళ్లకు జియో ట్యాగింగ్ పూర్తి చేయాలన్నారు. బిలో బేస్మెంట్ స్థాయిలో 452 ఇళ్లు ఉండగా, బేస్మెంట్ స్థాయిలో 294, ఆర్‌ఎల్ స్థాయిలో 62, ఆర్సీ స్థాయిలో 18 ఉన్నాయన్నారు. 135 ఇళు పూర్తయ్యాయని చెప్పారు. ఇక లేఅవుట్‌లో తాగునీరు, విద్యుత్ సరఫరా లాంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ చంద్రమౌళి రెడ్డి, ఆర్డీవో రాఘవేంద్ర, మున్సిపల్ కమిషనర్, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

గాండ్లపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

గాండ్లపెంట : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ అరుణ్‌బాబు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రులు మందులు ఉన్నాయా అని డిఎంఅండ్‌హెచ్‌ఒ కృష్ణారెడ్డి, ప్రాథమిక వైద్యాధికారి మారుతి, మహేశ్వర ప్రసాదులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం మండల పరిధిలోని కటారుపల్లి శ్రీ యోగివేమన ఆలయాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రవి, వీఆర్వోలు రఘు, జయరాం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతు భరోసాపై కదలిక

ఈనెల 30న పంపిణీ - జాబితాలు సిద్ధం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న సమయంలో రైతులు పెట్టుబడుల కోసం ఇబ్బందులు పడుతున్న సమయంలో ప్రభుత్వం రైతు భరోసాపై ప్రకటన చేసింది. ఈనెల 30వ తేదీన రైతు భరోసా కింద రూ.7500 ఒక్కో రైతు ఖాతాకు జమ చేయనుంది. ఈ మేరకు ప్రకటన వెలువడింది. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని కర్నూలు జిల్లాలో ప్రారంభించనున్నారు. ఇక్కడ జిల్లాలో మంత్రి ఉషశ్రీచరణ్ ప్రారంభించనున్నారు. జిల్లాలో ఎక్కడ ప్రారంభిస్తారన్నది ఇంకా నిర్ణయించాల్సి ఉంటుంది.

కాస్త ఊరట

మే నెలలో వర్షాలొస్తుండటంతో రైతులు దుక్కులు దున్ని భూములను సిద్ధం చేసుకుంటున్నారు. విత్తనాల పంపిణీకి ప్రభుత్వం రిజిస్ట్రేషన్లను ప్రారంభించింది. అయితే చేతిలో చిల్లిగవ్వలేకపోవడంతో రైతులు పెట్టుబడుల కోసం ఇబ్బందులు పడుతున్నారు. విత్తనాలు కూడా కొనలేక అవస్థలు పడుతున్నారు. మే నెలలో ప్రతి ఏటా ఇచ్చే రైతు భరోసాపైనా ప్రకటనలేకుండా ఉంది. ఇటువంటి సమయంలో శుక్రవారం నాడు ప్రభుత్వం రైతు భరోసా ఈనెల 30వ తేదీన ఇవ్వడానికి సిద్ధపడినట్లు ప్రకటన రావడంతో రైతులకు కాస్త ఊరట లభించినట్లు అయ్యింది. మొదటి విడత కింద ఇచ్చే రూ.7500 ఒక్కో రైతుకు ఇవ్వనున్నారు. దీంతో విత్తనాలు, దుక్కుల వరకైనా కొంత ఊరట లభించే అవకాశం ఉంది.

అందనున్న రూ.158 కోట్లు

అనంతపురం జిల్లా వరకు చూస్తే 2,87,479 మంది రైతులు రైతు భరోసా కింద అర్హులుగానున్నారు. వీరందరికీ కలిపి మొత్తం రూ.158.74 కోట్లు రైతు భరోసా కింద జిల్లాకు రానున్నాయి. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల ద్వారా లబ్ధిదారుల జాబితాలు సైతం సిద్ధం చేసియున్నారు. నియోజకవర్గాల వారీగా సైతం జాబితాలు సిద్ధంగానున్నాయి. గుంతకల్లు నియోజకవర్గం పరిధిలో మొత్తం 29381 మంద రైతులు ఉన్నారు. వీరికి రూ.16.15 కోట్లు. కళ్యాణదుర్గం నియోజకవర్గం పరిధిలో 53896 మంది రైతులకు రూ.29.64, రాప్తాడు నియోజకవర్గం పరిధిలో 24141 మంది రైతులకు రూ.13.27 కోట్లు, రాయదుర్గం నియోజకవర్గం పరిధిలో రూ.44655 మంది రైతులకు రూ.24.56 కోట్లు, శింగనమల నియోజకవర్గం పరిధిలో 53635 మంది రైతులకు రూ.29.49 కోట్లు, తాడిపత్రి నియోజకవర్గం పరిధిలో 31923 మంది రైతులకు రూ.17.55 కోట్లు, ఉరవకొండ నియోజకవర్గం పరిధిలో 49848 మంది రైతులకు రూ.27.41 కోట్లు రైతు భరోసా కింద రైతులకు సహాయం అందనుంది.

నష్టపరిహారం కూడా అందితే...

ఈ ఏడాది మార్చి, ఏప్రిల్, మే నెలల్లో వరుసగా పడుతున్న వర్షాల, గాలుల వల్ల రైతులు పంటలు నష్టపోయి ఉన్నారు. ప్రకృతి వైపరిత్యాలతో దెబ్బతిన్న రైతులకు ఇంకా పరిహారం అందలేదు. ఈ పరిహారం కూడా సీజన్ ప్రారంభంలోపు అందితే రైతులకు మరింత ప్రయోజనం చేకూరనుంది. దీనిపై ఇంకా ప్రభుత్వం వైపు నుంచి అధికారిక ప్రకటనేదీ వెలువడలేదు. ఇది కూడా ఇవ్వాలని నష్టపోయిన రైతులు కోరుతున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ప్రమోద్ కుమార్

యూజర్ ఛార్జీలు వసూలు చేయాలి

మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘం పరిధిలో ఇంటింటి చెత్త సేకరణకు సంబంధించి వసూలు చేయాల్సిన యూజర్ ఛార్జీలు తప్పని సరిగా వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ శానిటేషన్ సెక్రటరీలను ఆదేశించారు. పురపాలక సంఘ కార్యాలయంలో శుక్రవారం యూజర్ ఛార్జీలపై శానిటేషన్ సెక్రటరీలు, మెప్మా సిఓలు, ఆర్‌పిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతు పురపాలక సంఘ వ్యాప్తంగా 22 వాహనాల్లో ఇంటింటి చెత్త సేకరణ జరుగుతోంది. ప్రతి వార్డులో వంద శాతం యూజర్ ఛార్జీలను ఆయా సచివాలయ సెక్రటరీలు వసూలు చేయాలన్నారు. దీనికి మెప్మా విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఆర్‌పిలు సహకరించాలన్నారు. ఆర్‌పిలు ఆయా ప్రాంతాల్లో ఉన్న మహిళలను చైతన్యం చేసి ప్రతి నెలా అందరూ చెల్లించే విధంగా చూడాలన్నారు. నిర్లక్ష్యం చేసిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇదే సందర్భంగా రహమత్‌పురంలో అత్యధికంగా యూజర్ ఛార్జీలు వసూలు చేయడంతో అతన్ని అభినందించారు. సమావేశంలో మున్సిపల్ ఎఈ నాగేంద్ర, శానిటరి ఇన్స్‌పెక్టర్ నెట్టికల్లు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేను సకాలంలో పూర్తి చేయండి

పురపాలక సంఘం పరిధిలో భవనాలు, వాణిజ్య భవనాలు, ఖాళీ స్థలాలకు సంబంధించిన రీ సర్వేను వెంటనే పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ చాంబర్‌లో సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతు పురపాలక సంఘ వ్యాప్తంంంంగా 16ఎ, 16ఎఎ పై సమగ్ర సర్వే నిర్వహించాలన్నారు. ఇందులో ముఖ్యంగా 16ఎ కింద ఇప్పటికే ఆస్తి పన్నులు చెల్లిస్తున్న యజయానుల వివరాలను, 16ఎఎ కింద ఖాళీ జాగా పన్ను కడుతున్న యజమానుల వివరాలు ఆన్‌లైన్ చేయాలన్నారు. సర్వేను ఈ నెల 30వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. అలాగే పురపాలక సంఘ వ్యాప్తంగా అక్రమ కట్టడాలను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎసిపి ఆనంద్ కుమార్, అధికారులు రాము, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేయండి

అమరాపురం : ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ద్వారా అందించే సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేయాలని డిఎల్‌డిఒ శివారెడ్డి సూచించారు. ఆయన శుక్రవారం సచివా లయాలను, ప్రభుత్వాస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకావాలన్నారు. ప్రభుత్వం, ప్రజలకు మధ్య వారధిగా ఉంటున్న వాలంటీర్, సచివాలయ వ్యవస్థను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు అనంత రం అమరాపురం, హేమావతి సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించి సర్వీస్ రిజిస్టర్లను, రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపిడిఒ మునిస్వామి, పంచా యతీ కార్యదర్శి నరేష్, వీరన్న, సచివాలయ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

జిల్లా పంచాయతీ అధికారి ఆకస్మిక తనిఖీలు

బుక్కపట్నం : మండల పరిధిలో ప్రభుత్వం ద్వారా చేపడుతున్న వివిధ పనులను జిల్లా పంచాయతీ అధికారి విజయ్ కుమార్ శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో స్వచ్ఛభారత్ ద్వారా చేపడుతు న్న నిర్మాణ దశలో ఉన్న చెత్త సేకరణ కేంద్రాన్ని, ఎం ఆర్ సి కార్యాలయంలో జగనన్న విద్యా కానుక కిట్లను, నాడు నేడు పనులను , ఒకటవ అంగన్వాడి సెంటర్ ను తనిఖీ నిర్వహించి రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చేపడుతున్న పనులను త్వరిత తగతిన పూర్తి చేయాలని, పనుల్లో ఎటువంటి జాప్యం లేకుండా నాణ్యత ప్రమాణాలు పాటించి పనులు తొందరగా పూర్తి అయ్యేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు ,పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర ప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మార్సీలో తనిఖీలు చేస్తున్న డిపిఒ విజయ్‌కుమార్

ఈఎస్ఐ ఆసుపత్రిలో నాణ్యమైన వైద్య సేవలందించాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు జడ్డీ శ్రీనివాసులు

ప్రజాశక్తి-హిందూపురం

జిల్లాలో ఉండే ఒకే ఒక ఈఎస్ఐ ఆసుపత్రిలో తగినంత వైద్య సిబ్బంది లేక కార్మికులకు నాణ్యమైన వైద్య సేవలు అందడం లేదని, వెంటనే పూర్తి స్థాయి సిబ్బందిని నియమించి అవసరమైన మందులు సరఫరా చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జడ్డీ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఈఎస్ఐ ఆసుపత్రి ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా జడ్డీ శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి నరసింహప్ప మాట్లాడుతూ ఈఎస్ఐ హాస్పిటల్ పరిధిలో దాదాపు 40 వేల మంది కార్మికులకు వైద్య సేవలందాలన్నారు. హిందూపురం చుట్టుపక్కల ఉన్న మండలాల్లో వివిధ పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులు వారి వేతనాల నుంచి ప్రతి నెలా ఈఎస్ఐ చెల్లిస్తున్నప్పటికీ వారికి నాణ్యమైన వైద్య సేవలు అందడం లేదన్నారు. ఈఎస్ఐ హాస్పిటల్‌లో 19 మంది సిబ్బందికి గాకూ ఆరుగురు మాత్రమే ఉన్నారన్నారు. వారు కూడా సక్రమంగా పనిచేయటం లేదని ఆరోపించారు. దీనికి తోడు ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్య సేవలు, శస్త్ర చికిత్సలు చేయించుకుని దానికి సంబంధించిన బిల్లులను కార్మికులు ఈఎస్ఐ అధికారులకు సమర్పిస్తే, 6 నెలలు గడిచినా మంజూరు చేయడం లేదన్నారు. ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆసుపత్రుల్లో ఈఎస్ఐ కార్డు ఉన్నవారికి వైద్య సేవలు అందించడం లేదన్నారు. దీనికి ప్రధాన కారణం బిల్లులు సకాలంలో మంజూరు కాకపోవడమేనని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామన్నారు. అప్పటికీ పరిష్కరించకపోతే ఆసుపత్రి ఎదుట ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధమవుతామన్నారు. అనంతరం ఈఎస్ఐ వైద్య సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫ్రీ కాట్ వర్కర్స్ యూనియన్ నాయకులు లక్ష్మీనారాయణ రెడ్డి, కోశాధికారి నందీష్, నాగభూషణ్, రామకృష్ణ, జి.మారుతిరెడ్డి, హిందూపురం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మల్లికార్జున, ప్రధాన కార్యదర్శి జగదీష్, మంజునాథ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం ఇఎస్ఐ ఆసుపత్రి వద్ద నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

నాణ్యతలేని విత్తనాలతో రైతులకు నష్టం

ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి

నాశిరకంగా ఉన్న సబ్సిడీ వేరుశనగ నాయకులు

బడా సుబ్బిరెడ్డి

ప్రజాశక్తి-కదిరి టౌన్

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తనాలు నాణ్యత లేకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి ఎద్దేవా చేశారు. రైతులకు పంపిణీ చేసిన విత్తన వేరుశనగ కాయలను శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను అన్ని విధాలుగా ఆదుకుని, రాష్ట్రంలో రైతు రాజ్యం తెస్తామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం ఆచరణలో అందుకు భిన్నంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ప్రస్తుతం రైతులకు పంపిణీ చేస్తున్న సబ్సిడీ విత్తన వేరుశెనగ కాయలు నాణ్యతగా లేవన్నారు. కాంట్రాక్టర్లు ప్రాసెసింగ్ చేయకుండా రైతుల నుంచి కొనుగోలు చేసిన కాయలను యధా తథంగా సంచుల్లో నింపి రాళ్లు, మట్టితో కలిసిన వాటినే సరఫరా చేస్తున్నారని ధ్వజమెత్తారు. విత్తన పంపిణీ కేంద్రాల వద్ద కాయలను పరిశీలించిన రైతులు అవి విత్తనానికి పనికిరావని, తమకు అవసరం లేదని కాయలు తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదన్నారు. విత్తన వేరుశనగ నాణ్యతను పరిశీలించాల్సిన వ్యవసాయ శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. అవసరం ఉంటే తీసుకోండి లేదంటే రిటర్న్ పంపమని రైతులకు ఉచిత సలహాలు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాకు 90 వేల క్వింటాళ్లు అవసరం కాగా ఇప్పటివరకు కేవలం 20వేల క్వింటాళ్లు మాత్రమే వచ్చాయని, అవి కూడా నాణ్యతగా లేవన్నారు. ఉన్నతాధికారులు స్పందించి నాశిరకం విత్తన కాయలు పంపిణీ చేస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకొని నాణ్యమైన విత్తన వేరుశనగ కాయలు సకాలంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎక్కడికక్కడ రైతు భరోసా కేంద్రాల వద్ద పంపిణీని అడ్డుకుంటామని హెచ్చరించారు.

పారదర్శకంగా బదిలీలు : ఎస్పీ

పుట్టపర్తి రూరల్: శ్రీసత్యసాయి జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లలో ఐదేళ్ల నుంచి పని చేస్తున్న పోలీసుల బదిలీలను పారదర్శకంగా చేపట్టినట్లు ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. జిల్లాలో ని 122 మంది కానిస్టేబుళ్లకు శుక్రవారం పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో కౌన్సిలింగ్ ప్రక్రియ ద్వారా బదిలీలు నిర్వహించారు. ముందుగా కౌన్సిలింగ్‌కు హాజరైన సిబ్బందితో ఎస్పీ మాట్లాడారు. బదిలీల్లో సిఫార్సులకు తావులేకుండా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. కౌన్సిలింగ్ ప్రక్రియలో ఎస్పీతో పాటు ఏఎస్పీ కెవి రామకృష్ణప్రసాద్, ఎస్‌బి సిఐ రవీందర్ రెడ్డి, సిసి రాఘవేంద్ర, ఏ1 సూర్యతేజ, ఐటీ కోర్ సిబ్బంది, ఆఫీసు పర్యవేక్షకులు కామేశ్వరరావు, లీగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీల కోసం వచ్చిన జిల్లాకు చెందిన కానిస్టేబుళ్లు

కదిలిన విద్యాశాఖ యంత్రాంగం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-కదిరి టౌన్

కార్పొరేట్ విద్యాసంస్థలు చేస్తున్న దోపిడీపై ప్రజాశక్తిలో శుక్రవారం నాడు 'కదిరిలో కార్పొరేట్ దందా' శీర్షికన కథనం ప్రచురితం అయ్యింది. ఈ కథనంపై విద్యాశాఖ అధికారులు స్పందించారు. మండల విద్యాధికారి చిన్నకష్ణ శుక్రవారం నాడు కదిరి పట్టణం మదనపల్లి రోడ్‌లో గల శ్రీ చైతన్య విద్యా సంస్థను సందర్శించారు. ఆ పాఠశాల సిబ్బందితో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ చట్టం మేరకు ఎలాంటి ముందస్తు అడ్మిషన్లు నిర్వహించరాదని, పుస్తకాలు విక్రయించరాదని వారికి సూచించారు. అలాగే పాఠశాల పున్నప్రారంభం అనంతరం ఫీజులకు సంబంధించి బోర్డులను ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతరం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ పాఠశాలలో అడ్మిషన్లకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలన నిమిత్తం ఎమ్మార్సీ కార్యాలయానికి తీసుకెళ్లామన్నారు. ఇందులో ముందస్తు అడ్మిషన్లు చేసినట్లు రుజువైతే నివేదికను జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. వారి సూచనల మేరకు పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి : జెసి

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

రొళ్ల : ప్రజల సమస్యలపై ప్రత్యేక దష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ చేతన్ మండల అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం మండల పరిధిలో నాడు-నేడు కింద వివిధ పాఠశాలల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఇందులో భాగంగా హుట్టేబెట్ట, రత్నగిరి, అనుపమపల్లి, రొళ్ల, గొల్లహట్టి పాఠశాలల్లో పనుల పురోగతిపై చర్చించారు. అనంతరం మండలంలో అర్ధాంతరంగా ఆగిన రైతు భరోసా కేంద్రాలు, సచివాలయ భవన నిర్మాణాలపై ఆరా తీశారు. అలాగే సచివాలయం వెళ్లి సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ ఫలాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల రెవెన్యూ కార్యాలయంలో పలు రికార్డులను తనిఖీ చేసి రీసర్వే పురోగతి, అసైన్డ్ భూములపై తహశీల్దార్ హసీనా సుల్తాన్‌తో చర్చించారు. జెసి వెంట ఎంఈఓ శ్రీధర్, ఆర్‌ఐ మంజునాథ్, సూపరింటెండెంట్ ఆరాధ్య, ఎస్సై వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి రచన, ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

రూ.29.10 కోట్లతో రోడ్డు నిర్మాణం

పనులను ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే, జెడ్పీ ఛైర్‌పర్సన్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరం నియోజకవర్గానికి ప్రభుత్వం నుంచి కోట్లాది రూపాయలు మంజూరు చేయించుకొచ్చి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చి దిద్దుతానని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నాడు ధర్మవరం పట్టణంలోని ఎంఐజి లేఅవుట్ వద్ద నుంచి మరూరు జాతీయ రహదారి వరకు రూ.29,10 కోట్లతో 80 అడుగుల తారు రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ పూజా కార్యక్రమంలో ఎంపీ గోరంట్ల మాధవ్, జిల్లా పరిషత్ ఛైర్మన్ బోయ గిరజమ్మ, ఆహుడా ఛైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్డు నిర్మాణ పనులకు కొబ్బరి కాయలు కొట్టి పనులను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతు. ధర్మవరం నుంచి మరూరు వద్ద ఉన్న జాతీయ రహదారికి మధ్యన 126 ఎకరాల విస్తీర్ణంలో మధ్య తరగతి ప్రజల సొంత ఇంటి కల కోసం రూ.131 కోట్ల వ్యయంతో ఎంఐజి లేఅవుట్ (జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్)ను అన్ని మౌలిక వసతులతో ఏర్పాటు చేయనున్నట్లు జరుగుతోందన్నారు. ఇందులో భాగంగా జాతీయ రహదారి నుంచి ఎంఐజి లేఅవుట్ వరకు రూ.29.10 కోట్ల వ్యయంతో 80 అడుగుల తారు రోడ్డును వేస్తున్నట్లు చెప్పారు. ఆరు నెలల్లోపు పనులను పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అహుడా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఈశ్వరయ్య, డీఈ సూర్యనారాయణ, వైస్ ఛైర్మన్లు భాగ్యలక్ష్మి, పెనుజూరు నాగరాజు, పట్టణ కౌన్సిలర్లు, ధర్మవరం మండలం ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, జెడ్పీ ఛైర్‌పర్సన్

పుట్టపర్తి పిహెచ్‌సిలో రోగులను విచారిస్తున్న ఆర్డీవో భాగ్యరేఖ

పిహెచ్‌సి తనిఖీ : ఆర్డీవో

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆర్డీఓ భాగ్యరేఖ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మందులు, రికార్డులు, ల్యాబ్, వ్యాక్సిన్లు, ఓపి విభాగంలో సేవలను పరిశీలించారు. అనంతరం వైద్యులు, సిబ్బందిని పలు విషయాలపై ఆరా తీశారు. వైద్య సేవలు పొందడానికి వచ్చే ప్రజల పట్ల దురుసుగా ప్రవర్తించరాదని, ఇక్కడ అందించే సేవలు వారికి అర్థమయ్యే రీతిలో తెలియపరచాలని సూచించారు. ఆమె వెంట వైద్యాధికారు లు డాక్టర్ నాగరాజునాయక్, డాక్టర్ జోత్స్న, సిహెచ్‌ఓ నగేష్, స్టాఫ్ నర్స్ అమ్మాజీ, ఫార్మాసిస్ట్ నాగవేణి, ల్యాబ్ టెక్నీషియన్, కేశవ, తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే ఫిర్యాదు చేయండి

ధర్మవరం టౌన్ : పట్టణంలోని ప్రయివేటు విద్యాసంస్థల్లో బలవంతంగా అడ్మిషన్లు చేసినా, అధిక ఫీజులు వసూలు చేసినా విద్యార్థుల తల్లిదండ్రులు డీఈఓకు ఫిర్యాదు చేయాలని ఎంఈఓ సుధాకర్‌నాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రయివేటు విద్యాసంస్థలో ముందస్తు అడ్మిషన్లు చేయరాదని, అధిక ఫీజులు వసూలు చేయరాదన్నారు. అలా చేసిన పాఠశాలల గుర్తింపును రద్దు చేస్తామని ఆయన హెచ్చరించారు.

29న విత్తన వేరుశనగ పంపిణీ

కొత్తచెరువు: ఈ నెల 29వ తేదీ నుంచి మండల వ్యాప్తంగా ఉన్న అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేస్తారనా వ్యవసాయ అధికారి నటరాజు శుక్రవారం తెలిపారు. రైతు భరోసా కేంద్రానికి పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, సెల్ ఫోన్ తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు విత్తన కాయలు పంపిణీ చేస్తామన్నారు. పాసుపుస్తకం ఉన్న రైతులకు 40 శాతం సబ్సిడీతో 3 బస్తాలు పంపిణీ చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఘనంగా ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు

లేపాక్షి : స్థానిక బస్టాండ్ ఆవరణలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద శత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా ఎన్టీఆర్ విగ్రహాన్ని పూలమాలలతో అలంకరించారు. అలాగే కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఆయన చేసిన ప్రజా సంక్షేమ కార్యక్రమా ల గురించి వివరించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు జయప్ప, ఆనంద్‌కుమార్, అంబికా లక్ష్మినారాయణ, నాగరాజు, మాలక్క, చంద్ర, రవి, తదితరులు పాల్గొన్నారు

లేపాక్షి బస్టాండ్ ఆవరణలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు ప్రారంభం

గోరంట్ల: పట్టణంలో ఎస్పీవీఎం డిగ్రీ, శ్రీకృష్ణదేవరాయల జూనియర్ కళాశాలల్లో 2023-24 విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ భక్తవత్సలం శుక్రవారం తెలిపారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి డిగ్రీలో బిబిఏ, బిసిఏ కోర్సుల్లో అడ్మిషన్లు పొందడానికి అవకాశం ఉందన్నారు. విద్యార్థులు ఒరిజినల్, జిరాక్స్ కాపీ సర్టిఫికెట్లతో పాటు 4 ఫోటోలు తీసుకురావాలన్నారు.

విధిగా రేషన్ బియ్యం పంపిణీ చేయాలి

ధర్మవరం టౌన్ : తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ విధిగా రేషన్ బియ్యాన్ని అందజేయాలని ధర్మవరం ఆర్డీఓ తిప్పేనాయక్ పేర్కొన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ సమావేశపు భవనంలో శుక్రవారం డివిజన్ పరిదిలోని ఎండీయూ ఆపరేటర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ గతంలో వేలిముద్రలు పడనివారు బియ్యం పంపిణీ విషయంలో స్టోర్ డీలర్లు ఎన్నో ఇబ్బందులను పడేవారని, నేడు అలా కాకుండా వేలిముద్ర పడని వారికి ఈ ఐరీష్ డివైనెస్ పరికరం ద్వారా తప్పక బియ్యం పంపిణీచేయడం శుభ పరిణామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ ఏఎస్ఓ లక్ష్మీదేవి. డివిజన్ పరిధిలోని సీఎస్ డీ టీలు శారద, కవిత, సావిత్రి, మునిస్వామి పాల్గొన్నారు.

ఎండీయూ ఆపరేటర్లకు ఐరిష్ పరికరాలను పంపిణీ చేస్తున్న ఆర్డీఓ తిప్పేనాయక్

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తాం

ఎమ్మెల్యే శంకరనారాయణ

ప్రజాశక్తి-పరిగి

అర్హులందరూ ఇల్లు నిర్మించుకునే విధంగా ప్రభుత్వం చేయూతనిస్తుందని ఎమ్మెల్యే శంకర నారాయణ తెలిపారు. పరిగి మండలంలో చేపట్టిన జగనన్న ఇళ్ల నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన ఎమ్మెల్సీ మంగమ్మతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క అర్హుడికి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తుందని 1,50,000 తో ఇంటి నిర్మాణాలు చేపట్టి సొంతింటి కలను వైసిపి నెరవేరుస్తుందన్నారు. అనంతరం పరిగి మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో పాల్గొని ఉత్తమ వాలంటీర్లకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రతి ఒక్క అర్హుడికి సంక్షేమ పథకాలు అందే విధంగా వాలంటీర్లు పనిచేయాలని ఎమ్మెల్యే శంకర నారాయణ సూచించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థ వాలంటీర్ల వ్యవస్థ ప్రభుత్వానికి ఉన్న వన్నె తెచ్చాయని టిడిపి అధికారంలోకి వస్తే వీటిని తొలగించే ప్రయత్నం చేస్తారని అందరికీ సంక్షేమం ఉండాలంటే వాలంటీర్ వ్యవస్థ తోనే సాధ్యమని ఆయన అన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని మరోమారు వచ్చే విధంగా వాలంటీర్లు పనిచేయాలని ఆయన అన్నారు. కార్యక్రమం అనంతరం మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొని ప్రభుత్వ కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకొని మండల అభివృద్ధి కి పనిచేయాలని అన్నారు. సర్వసభ్య సమావేశంలో మండలంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ఆయా శాఖల అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సరస్వతి ఎంఈఓ లక్ష్మీదేవి ఏవో విజయభారతి ఎంపీపీ సరితా ప్రభాకర్ మారుతీ రెడ్డి రమణ స్పెషల్ ఆఫీసర్ ప్రసాదరావు సర్పంచ్లు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

ఉత్తమ వాలంటీర్లకు సన్మానం

గాండ్లపెంట: స్థానిక ఎస్ఆర్ ఫంక్షన్ హాలులో శుక్రవారం ఉత్తమ సేవలందించిన వాలంటీర్లను ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాలు, వాలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు 33 సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందజేస్తున్నారన్నారు. ఉత్తమ సేవలందించిన వాలంటీర్లకు ఏటా సన్మానం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ డి.అంజినప్ప, సీనియర్ సహాయకుడు ఎస్.అమీర్‌బాషా, ఎంపిపి టీ. జగన్మోహన్, వైసిపి మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, వైస్ ఎంపిపి గంగోజమ్మ, మాజీ జడ్పిటిసి భాస్కర్ రెడ్డి, సర్పంచిలు ఎస్.రహమతుల్లా, సుధాకర్, రవీంద్ర నాయక్, ఆర్‌బికె ఛైర్మన్ శంకరనాయుడు, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ వాలంటీర్లను సన్మానించిన ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

జీతంలో కోత విధించడమేంటి.?

సచివాలయ ఉద్యోగుల ఆవేదన

మడకశిర రూరల్ : ఎలాంటి నోటీసు ఇవ్వకుండా, వివరణ కోరకుండా జీతంలో కోత విధించడం ఏంటని సచివాలయ ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని ఆమిదాలగొంది 1, 2 గ్రామ సచివాలయ పరిధిలో విధులు నిర్వహిస్తున్న 8 మందికి మే నెల జీతంలో రూ. 3 నుంచి రూ. 8వేల వరకు కోత విధించారు. దీంతో వారు శుక్రవారం ఎంపిడిఓ కార్యాలయం చేరుకొని ఏవో నరసింహమూర్తిని కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శిని ఎంపిడిఓ కార్యాలయానికి పిలిపించి ఆరా తీయగా ఆమిదాలగొంది 1,2 సచివాలయాలకు ఇన్‌ఛార్జిగా విధులు నిర్వహిస్తున్నానని, సిబ్బంది బయోమెట్రిక్ ఆధారంగా వంద శాతం నమోదైన వారికి జీతం పూర్తిస్థాయిలో పడిందన్నారు. బయోమెట్రిక్ సక్రమంగా నమోదు కాని వారికి కొంతవరకు కోత పడినట్లు తమకు ట్రెజరీ అధికారుల ద్వారా తెలిసిందన్నారు. దీనిపై ఎంపిడిఓ సోనియాబాయి మాట్లాడుతూ తాను సెలవులో ఉన్నానని శనివారం కార్యాలయానికి వచ్చి సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు.

ఈకేవైసీ త్వరితగతిన పూర్తి చేయాలి

గోరంట్ల రూరల్ : గృహ నిర్మాణ లబ్ధిదారులకు త్వరితగతిన ఈకేవైసీ పూర్తి చేయాలని ఎంపిడిఓ రఘునాథ గుప్తా పేర్కొన్నారు. ఆయన శుక్రవారం మండల పరిధిలోని నార్సింపల్లి సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో అటెండెన్స్ రిజిస్టర్ మూమెంట్ రిజిస్టర్ మరియు ఇతర రిజిస్టర్ లను పరిశీలించారు. సిటిజన్ ఔట్రిచ్ ప్రోగ్రాం ప్రతి శుక్రవారం పూర్తి చేయాల్సిందిగా ఆయన ఆదేశించారు. సచివాలయాలకు వచ్చి గ్రామస్తులతో లబ్ధిదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. గ్రామంలో లబ్ధిదారుల లిస్టును సచివాలయంలో ప్రదర్శించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపిడిఓ రఘునాథ్‌గుప్తా

'ఉపాధి'పై సామాజిక తనిఖీ

లేపాక్షి: ఉపాధి హామీ చట్టం ద్వారా 2022-23లో రూ. 5 కోట్లు మంజూరు కాగా 4.49కోట్లు పనులు నిర్వహించారు. వాటిపై పది రోజుల నుంచి సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయం వద్ద పంచాయతీల వారీగా జరిగిన పనులపై సామాజిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా లేపాక్షి పంచాయతీలో రూ. 5545, కొండూరులో రూ. 2658, బిసలమనేపల్లిలో రూ. 10వేలు, కలూరులో రూ. 11వేలు, మైదుగోళంలో రూ. 2 వేలు, చోళసము ద్రంలో రూ. 7412, నాయనపల్లిలో రూ. 3వేలు, పులమతిలో రూ. 5309, సిరివరంలో రూ. 70,949, కంచిసముద్రం లో రూ. 34212లను రికవరీ చేయాలని సామజిక తనిఖీలో వెల్లడించారు. మండల వ్యాప్తంగా రూ. 1,55,347 రికవరీ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ రామాంజనేయులు, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ రమణారెడ్డి, ఎంపిడిఓ నరసింహనాయుడు, ఏపీఓ జ్యోతి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలపై సమావేశం నిర్వహించిన అధికారులు

విద్యార్థినికి రూ.20వేలు అందజేత

కదిరి టౌన్ : కదిరి రూరల్ మండల పరిధిలోని మత్తన్నగారిపల్లికి చెందిన రజిత పదో తరగతి ఫలితాల్లో మండల టాపర్‌గా నిలవడంతో శుక్రవారం వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ రూ. 20 వేల నగదు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగరాజు కుమార్తె రజిత కస్తూర్బా బాలికల ఉన్నత పాఠశాలలో చదివి 565 మార్కులు సాధించిందన్నారు. సీఎం జగన్ విద్యకు ప్రాధాన్యమిస్తూ నాడు-నేడు కార్యక్రమం ద్వారా వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారన్నారు. రజిత ఉన్నత చదువుల కోసం అండగా ఉంటానని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆయన వెంట వైసిపి సీనియర్ నాయకులు డాక్టర్ బత్తల వెంకటరమణ, వైస్ ఎంపిపి బత్తల ఆదినారాయణ, పట్టణ అధ్యక్షులు బహావుద్దీన్, రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి లింగాల లోకేశ్వర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా సిపిఐ కార్యదర్శి వేమయ్య యాదవ్ తెలిపారు. ప్రశాంతి గ్రామ్ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద శుక్రవారం ఆయన ఆటో స్టాండ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు, రవాణా శాఖ అధికారులు తరచూ వేధింపులకు పాల్పడుతూ, పెనాల్టీలు వేస్తూ కార్మికులను ఇబ్బందులపాలు చేస్తున్నారన్నారు. ఆ సమస్యలను ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్తామన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆటో యూనియన్ నాయకులు ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, గౌస్ లాజాం, సిపిఐ పట్టణ కార్యదర్శి వెంకటరమణ, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జయలక్ష్మి, ఆటో యూనియన్ అధ్యక్షుడు గంగాద్రి, జయరాం నాయక్, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు వసతి గృహాలు ఏర్పాటు

కదిరి అర్బన్ : ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి దర్శనం కోసం వచ్చే భక్తులకు వసతి సౌకర్యార్థం ఆలయ అధికారులు అమతవల్లి సదన్(చలపతి నాయిని సత్రం)లో అత్యాధునిక సదుపాయాలు కల్పించినట్లు ఈవో గురుప్రసాద్, పాలకమండలి ఛైర్మన్ గోపాలకృష్ణ శుక్రవారం తెలిపారు. 32 డీలక్స్, ఏసి, మామూలు గదులను ప్రారంభించి, పార్కింగ్ సౌకర్యంతో పాటు భవన నిర్మాణం పూర్తి చేశారు. భక్తులకు కేటాయించే గదుల సమాచారం కోసం 08494-292066 నంబర్‌ను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. దర్శనం కోసం వచ్చే భక్తులకు సకల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు

ఉత్తమ వాలంటీర్లను సన్మానించిన ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

ఉత్తమ వాలంటీర్లకు సన్మానం

లేపాక్షి : పట్టనంలోని ఫంక్షన్‌హాలులో శుక్రవారం మండలంలోని ఉత్తమ వాలంటీర్లను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ హాజరై ఐదుగురు వాలంటీర్లకు రూ. 20వేల నగదు, ప్రశంసా పత్రం, 225 మందికి రూ. 10వేలు అందజేశారు. సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో వాలంటీర్ పాత్ర చాలా విలువైందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ నరసింహ నాయుడు, ఈ ఓ ఆర్ డి శివన్న, సర్పంచి ఆదినారాయణ, వైసిపి మండల కన్వీనర్ నారాయణస్వామి, సర్పంచి మంజునాథ్, జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపిపిలు అంజనరెడ్డి, నీలావతి, పంచాయతీ కార్యదర్శులు నాగేంద్ర, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు

ఆర్టీసీలో కారుణ్య నియామకాలపై ఎన్ఎంయు హర్షం

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఆర్టీసీలో కారుణ్య నియామకాలపై ఎన్ఎంయు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా వివిధ డిపోల్లో 2016 నుంచి పెండింగ్‌లో ఉన్న 17 ఆర్టీసీ కానిస్టేబుల్, 32 శ్రామిక్ ఉద్యోగాలను సర్వీసులో చనిపోయిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఇవ్వడం పట్ల ఎన్ఎంయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం అనంతపురం వచ్చిన ఆయన రాష్ట్ర నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎంయు అధ్యక్షుడు పి.వి.రమణారెడ్డి మాట్లాడుతూ కొవిడ్ సమయంలో, సర్వీసులో చనిపోయిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ ఎన్ఎంయు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రికి, రవాణా శాఖ మంత్రికి, ఆర్టీసీ ఎండికి అనేక దఫాలుగా విన్నవించామని తెలిపారు. 2016 ముందు కూడా పెండింగ్‌లో వున్న దరఖాస్తులను క్లియర్ చేసి, వారికి న్యా యం చేయాలని కోరామన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలోకి విలీనమైన తర్వాత సర్వీసులో చనిపోయి, విద్యార్హత తక్కువ వున్న ఉద్యోగుల పిల్లలకు కూడా వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే మెడికల్ అన్ ఫిట్ కాబడిన ఆర్టీసీ డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఉద్యోగావకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు హరి మోహన్, ఎన్.వి.రమణ, రాష్ట్ర నాయకులు భాస్కర్ నాయుడు, ఇస్మాయిల్, పిఎస్ఎన్ రావు, రీజినల్ కార్యదర్శులు మద్దిలేటి, షబ్బీర్, అధ్యక్షులు అశ్వర్థమయ్య, కదిరి డిపో సెక్రటరీ బైరిశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావుతో ఎన్ఎంయు నాయకులు

పాఠ్యపుస్తకాలను సకాలంలో అందించండి

రొళ్ల : విద్యార్థులకు సకాలంలో పాఠ్యపుస్తకాలు అందించాలని జిల్లా పిడి నరసయ్య విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. అలాగే విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని సూచించారు. సంకల్పంతో పాఠశాల పున్ణ ప్రారంభంలోపు విద్యార్థులకు అందించాలని మండల విద్యాశాఖ అధికారి శ్రీధర్ కు ఆదేశించారు.

పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న పిడి నరసయ్య

పేదలపై జగన్ కపటప్రేమ

టిడిపి జిల్లా అధికార ప్రతినిధి వి.సోమశేఖర్

ప్రజాశక్తి-కదిరి టౌన్

సిఎం జగన్మోహన్‌రెడ్డి అమరావతిలో సెంటు పట్టా పేరుతో పేదలను దగా చేస్తున్నారని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి వల్లెపు సోమశేఖర్ మండిపడ్డారు. పట్టణంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ వైసిపి పాలనలో రాజకీయ డ్రామాలు తప్ప అభివద్ధి శూన్యమన్నారు. సిఎం జగన్ పేదలపై కపట ప్రేమ చూపిస్తున్నారని ఆరోపించారు. అమరావతిలో పేదలను బలవంతంగా సీఎం బహిరంగ సభకు తరలించారన్నారు. టిడిపి హయాంలో 90 శాతం పూర్తయిన టిడ్కో ఇళ్లను నాలుగేళ్లుగా లబ్ధిదారులకు అందజేయకుం డా కాలయాపన చేస్తున్నారని తెలిపారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజధానిలో అల్లర్లు సష్టించడానికి జగన్ సర్కార్ ప్రయత్నాలు చేస్తుందని విమర్శించారు. జగన్‌ను ఓటమి వెంటాడుతుందన్నారు. ఇప్పటికే అధికార పార్టీ నాయకులు టిడిపి వైపు చూస్తున్నారని వచ్చే ఎన్నికల్లో వైకాపా ఘోరంగా ఓడిపోవడం ఖాయమన్నారు.

పాడి పశువులకు కృత్రిమ గర్భధారణ

తనకల్లు : పాడి పశువులకు ఉచిత కృత్రిమ గర్భధారణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి డాక్టర్ హరినాథ్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు జూన్, జులై నెలల్లో పాడి పశువులకు ఉచితంగా కృత్రిమ గర్భధారణ చేస్తారన్నారు. కావున మండలంలోని పాడి రైతులు జూన్ 1 నుంచి జులై 31 వరకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో కృత్రిమ గర్భధారణ చేసే గోపాలమిత్రలు, పశువైద్య సహాయకులు, ఉచితంగా కృత్రిమ గర్భధారణ చేసి వారికి రశీదు ఇచ్చి ఉపయోగించిన సెమెన్ స్ట్రాను ఆ రైతుకే ఇచ్చి ఆ రైతు వివరాలను నమోదు చేయాలన్నారు.

పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

తనకల్లు : ప్రభుత్వ పశు బీమా పథకాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పరిధిలోని తవలం పశు వైద్యాధికారి డాక్టర్ హరినాథ్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటన తెలిపారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పశువులు, గొర్రెలు, మేకలు గల రైతులు తమ జీవాలకు బీమా చేయించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. గతంలో ఉన్న వైఎస్ఆర్ పశు నష్ట పరిహారం పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం తిరిగి ప్రారంభించిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిపిఎల్ వారు 20 శాతం వాటా, ఏపిఎల్ వారు 50% వాటా చెల్లించి బీమా చేయించుకోవాలన్నారు. ఒక కుటుంబానికి 5 గేదెలు, లేదా ఆవులు, 50 మేకలు, లేక గొర్రెలు, పందులకు ఈ బీమా పథకం వర్తిస్తుందని తెలిపారు. మరిన్ని వివరాల కోసం సమీప రైతు భరోసా కేంద్రంలో కానీ పశు వైద్యాధికారిని కానీ సంప్రదించాలని తెలిపారు.

ఆటోను ఢీకొన్న ఐచర్.. వ్యక్తి మృతి

ఇద్దరికి తీవ్ర గాయాలు

తాడిపత్రి రూరల్ : మండల పరిధిలోని ఇగుడూరు గ్రామం వద్ద ప్రయాణికులను ఎక్కించుకునేందుకు తాడిపత్రి - గుత్తి జాతీయ రహదారిపై వెళ్తున్న ఆటోను ఐచర్ లారీ ఢీకొన్న ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పెద్దపప్పూరు మండలం నరసాపురం గ్రామానికి చెందిన బాలన్న (55) తన ఆటోలో నరసాపురం నుంచి తాడిపత్రి వరకు ఇద్దరు ప్రయాణికులను ఎక్కించుకుని వస్తున్నాడు. అయితే ఇగుడూరు గ్రామ సమీపంలో తాడిపత్రి - గుత్తి ప్రధాన రహదారిపై ఆటో నెమ్మదిగా వస్తున్న క్రమంలో అదే మార్గంలో వెనుకనే వేగంగా వచ్చిన ఐచర్ లారీ ప్రమాదవశాత్తు ఆటోను ఢీకొంది. దీంతో ఆటో సుమారు 10 అడుగుల మేర బోల్తా కొట్టుకుంటూ వెళ్లింది. ఈ ప్రమాదంలో ఆటోలో ముందు వైపు ఉన్న డ్రైవర్ బాలన్న అక్కడికక్కడే మతి చెందాడు. ఆయనతో పాటు ఉన్న ఇద్దరు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108లో తాడిపత్రి ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. స్థానికుల సమాచారంతో విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు ప్రభుత్వాసుపత్రికి వెళ్లి ప్రమాదం జరిగిన తీరును అడిగి వివరాలను నమోదు చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంలో మృతిచెందిన బాలన్న

మహానాడుకు తరలిన టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి-హిందూపురం

రాజమండ్రిలో జరుగుతున్న టిడిపి మహానాడు కార్యక్రమానికి హాజరు కావాడానికి శుక్రవారం పురం టిడిపి నాయకులు బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మినారాయణ, పట్టణ అధ్యక్షులు రమేష్‌కుమార్ మాట్లాడుతూ టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల నేపథ్యంలో మహానాడుకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. ఎన్టీఆర్ ప్రాతినిథ్యం వహించిన హిందూపురం నియోజకవర్గం నుంచి శాసనసభ్యులు నందమూరి బాలకష్ణ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తరలివెళ్తున్నట్లు నాయకులు పేర్కొన్నారు. వీరి వెంట రాష్ట్ర కార్యదర్శి కొల్లకుంట అంజినప్ప, మాజీ కార్యదర్శి దేమకేతే పల్లి అంజినప్ప, తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి పరిమళ, ఐటీడీపి పార్లమెంట్ అధ్యక్షులు రామాంజి నేయులు, అమర్నాథ్, రాము, కురుబ శేఖర్, వెంకట రమణ, ప్రెస్ వెంకటేష్, మంగేష్, దుర్గ నవీన్, మాక్బుల్ బాషా, అమాన్, సునీల్ తదితరులు వెళ్లారు.

ధర్మవరం టౌన్: రాజమండ్రిలో రెండు రోజుల పాటు జరగనున్న మహానాడుకు మండలం నుంచి టిడిపి శ్రేణులు శుక్రవారం బయల్దేరి వెళ్లారు. ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పిలుపు మేరకు నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక వాహనాలు, రైళ్లలో బయల్దేరి వెళ్లారు. రెండు రోజుల పాటు జరిగే మహానాడులో పాల్గొనడానికి వెళ్తున్నామని పలువురు నాయకులు పేర్కొన్నారు. అలాగే 25వ వార్డు ఇన్‌ఛార్జి భీమనేని ప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు బయల్దేరి వెళ్లారు.

ధర్మవరంలోబయల్దేరిన తెలుగు తమ్ముళ్లు

పెనుకొండలో సవితమ్మ ఆధ్వర్యంలో బయల్దేరిన టిడిపి నాయకులు

పెనుకొండ : ఈ నెల 27, 28వ తేదీల్లో రాజమహేంద్రవరంలో టిడిపి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలకు నియోజకవర్గం నుంచి టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు బయల్దేరి వెళ్లారు. ముందుగా పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం బస్సులు, కార్లలో బయల్తేరి వెళ్లారు.

పుట్టపర్తి అర్బన్ : పుట్టపర్తి నియోజకవర్గం లోని ఆరు మండలాల నుంచి మహానాడుకు తెలుగు తమ్ముళ్లు భారీగా తరలి వెళ్లారు. శుక్రవారం పలువురు రైళ్ల లోను, ప్రత్యేక బస్సులలో, కార్లలో

హిందూపురం రైల్వేస్టేషన్‌లో బాలయ్య అభిమానులు

రాజమహేంద్రవరంలో రెండు రోజులపాటు జరిగే మహానాడుకు తరలి వెళ్లారు. పుట్టపర్తి నుంచి పట్టణ గ్రామీణ మండలాల కన్వీనర్లు రామాంజనేయులు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో తరలి వెళ్లారు. అలాగే బుక్కపట్నం మండలంలో కన్వీనర్ మల్లారెడ్డి, నల్లమడ కన్వీనర్ మైలే శంకర్ ఆధ్వర్యంలో బయలుదేరి వెళ్లారు. అలాగే ఆమడగురు, ఒడిసి, కొత్తచెరువు మండలాల కన్వీనర్లు, సీనియర్ నాయకులు తరలి వెళ్లారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో పలువురు రైలులో బయలుదేరి వెళ్లారు. గత రెండు రోజులుగా మాజీ మంత్రి నియోజకవర్గం ఇంచార్జ్ పల్లె రఘునాథ్ రెడ్డి ఆయా మండలాల్లో విస్తతంగా పర్యటించి నాయకులు కార్యకర్తలు సమీకరణలో నిమగ్నమై భారీగా తరలి వెళ్లడానికి కషి చేశారు.

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తి మండల పరిధిలోని పలు గ్రామాల నుండి టిడిపి నాయకులు, కార్యకర్తలు శుక్రవారం మహానాడుకు బయలుదేరి వెళ్లారు. మండల కన్వీనర్లు విజయ్ కుమార్, రామాంజనేయులు, ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు ప్రత్యేక బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. రాజమహేంద్రవరంలో 27,28న జరుగు మహానాడు విజయవంతం చేయాలని దక్పథంతో వందలాదిమంది మండలం నుండి బయలుదేరి వెళుతున్నట్లు వారు తెలిపారు. ప్రభుత్వం అడుగడుగున మహానాడు ను అడ్డుకోవాలని ప్రయత్నిస్తుందని కానీ దానిని విజయవంతం చేస్తామని వారు భీమ వ్యక్తం చేశారు.

డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం పేర్లు నమోదు చేసుకోండి

లేపాక్షి : మండల పరిధిలోని చోళసముద్రం, లేపాక్షి-2 రైతు భరోసా కేంద్రాలను శుక్రవారం ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. సబ్సిడీపై అందిస్తున్న వేరుశనగ కాయలు నాణ్యతగా ఉన్నాయన్నారు. అలాగే ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న డ్రిప్‌లు, స్ప్రింక్లర్లు కావాల్సిన రైతులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఆయన వెంట ఎఒ శ్రీలత, రఘు, పుష్పలత, తదితరులు ఉన్నారు.

పేరు మార్పు కొరకు

కందుకూరు మహమ్మద్ నయీమ్ తండ్రి జాఫర్ వలి కందుకూరు, కదిరి, శ్రీసత్యసాయి జిల్లా నివాసి అయిన నేను తెలుపుకుంటున్నది ఏమనగా **కందుకూర్ మహమ్మద్ నయీమ్ తండ్రి జాఫర్ వలి కందుకూర్ (పాత పేరు)** ను ప్రస్తుతము **"కందుకూర్ మహమ్మద్ నయీమ్ తండ్రి జాఫర్ వలి కందుకూర్"** గా కాకుండా **"కందుకూరు మహమ్మద్ నయీమ్ తండ్రి జాఫర్ వలి కందుకూరు"** గా మార్చుకుంటున్నాను. నేటి నుండి నా వ్యవహారములు అన్నియూ **"కందుకూరు మహమ్మద్ నయీమ్ తండ్రి జాఫర్ వలి కందుకూరు"** గానే పరిగణింపబడును అని తెలుపుకుంటున్నాను. కావున యావన్మంది గమనించవలసినదిగా కోరుచున్నాను.

(కందుకూరు మహమ్మద్ నయీమ్)
S/o జాఫర్ వలి కందుకూరు
డోర్ నెం.7-325, జౌక్‌పాళ్యం వీధి,
కదిరి-515 591, శ్రీ సత్యసాయి జిల్లా.